# ఎఫెక్ట్

"రండి స్వామీ...రండి... చాన్నాళ్ళకి దర్శనాలిప్పించారు."

"మరేం చేస్తాం, రాక తప్పుతుందా? ఎక్కడైనా ఎగనామాలు పెట్టొచ్చుగాని... దేవిగారి దగ్గరనా?"

"పోనీ ఆ మాత్రం భయం వుండైనావచ్చారు. అదే చాలు. సరేగానండీ. ఆ మూల ఏముందో చూసేరా?... మా ఫాదర్‌కి ప్రమోషన్ రావటంవల్ల అఫీషియల్‌గా ఫోన్ వేయించారు... తెలుసా?''

"అబ్బా...అయితే గవర్నమెంటువారికి మన బాధ తెలిసొచ్చిందన్నమాట"...

"స్వామీ! అర్థమయ్యేటట్టు చెప్ప ప్రార్థన."

"మరేంలేదూ...ఈ ప్రేమ పక్షులు రెండూ గిలగిల తన్నుకుంటాయి... తరచు మాటల్లేక...అన్జెప్పి ఫోన్ వేయించారు ఇంకేం వుందీ ఇకనుండి హాయిగా మాట్లాడుకోవచ్చు ఇద్దరమున్నూ..."

"ఆఁ ఆఁ ఓవేళ...నాన్నగారుగాని ఫోనుదగ్గరుండగా మీరు ఫోను చెయ్యాలిట... ఇక చూసుకోండీ..."

"మాటలేనా... లేక కాఫీ ఏమైనా."

కాఫీ టేబిలుమీద పెడుతూ అంది విమల..."సరేకాని మీ లలిత ఏమంటోందేమిటి?" ఓరగా చూసింది రామగోపాలం

ముఖంలోకి. చట్టున జడ చేతిలోకి దొరకపుచ్చుకున్నాడు... "అమ్మ దొంగా ఇదెప్పటినుండి నేర్చుకున్నావు"... అంటూ.

"ఏవిటీ?" ఏమీ తెలియనట్టుగా జడ విడిపించుకొని కుర్చీలో కూర్చుంది విమల.

"ఆ లలితమీద... ఈ సుబ్బలక్ష్మిమీద... నామీద అనుమానాలు పెంచుకుంటూ క్రాస్ ఎగ్జామిన్ చెయ్యటమూ... నీ ఆడబుద్ధి చూపించుకోవటమూ..."

'ఇప్పుడు నే నేమన్నానని...వాళ్ళూ మీరూ మొన్న నేదో సినిమాకు వెళ్ళినట్టుంటే, ఏవిటి సంగతీ అని అడిగా... అదీ ఓ అనుమానమేనా' మూతి చక్కా ముడిచి సింగారంగా అంటుంటే చూడ ముచ్చటగా వుంది రామగోపాలానికి. అలాచూస్తూ కూర్చున్నాడు కొంత సేపు.

"ఇంతకీ అంతగా లలితతో తిరుగుతారుకదా లలిత ఎలాంటిదంటారు?" అంది ఉత్సుకతతో విమల.

కుర్చీలో ఈజీగా కూర్చుంటూ సిగరెట్టు పొగరింగుల్లోకి దీర్ఘంగా చూశాడు రామగోపాలం.

"విమ్మీ... ఒకటి చెప్తాను వింటావ్? లలిత గురించి అడుగుతున్నావనికాదుకాని ఏ మనిషి గురించైనా నిర్ధారణగా చెప్పటం కష్టం. నవలల్లోనూ, సినిమాల్లోనూ, డైలాగుల్లోనూ ఓ మనిషిని చిత్రంగా చిత్రించేస్తారు. అలా ఓ మనిషి శీలాన్ని మనం మనసులో గాని, మాటల్లోగాని పూర్తిగా చిత్రించడం కష్టమని నా అభిప్రాయం. అంటే చిత్రించలేం. ఒకవేళ అలా ఓ మనిషిని గురించి ఖచ్చితంగా చెప్పినా తప్పే అవుతుంది. అది నా థియరీ."

"అయితే షేక్‌స్పియరూ, కాళిదాసూ మొదలైన వాళ్లే అంత ఖచ్చితంగా చిత్రించలేదంటారా ? చిత్రించినా తప్పంటారా ?"

"అవి నాటకంకోసం— ఓ ప్రయోజనం కోసం— ఓ పాత్ర కోసం సృష్టించబడ్డాయి. మనుషుల్ని చూసి ఆ పాత్రలు సృష్టించినా ఒక కోణంనుండి మాత్రమే చూసి చిత్రించబడ్డాయి . ఎవరైనా అంతే ఒక మనిషిని మరో మనిషి కొన్ని కోణాల్లోంచి మాత్రమే చూడగలడు. ఆకోణాల్లోంచి వాడి ప్రవర్తన ఇష్టపడితే మంచివాడంటారు. ఇష్టపడక పోతే చెడ్డవాడంటారు. అయినా షేక్‌స్పియర్ గురించి అనుకుంటున్నాం అంటే సాహిత్యంలోకి వెళ్ళిపోతున్నాం అన్నమాట. నేను నవలల సంగతీ, నాటకాల సంగతీ మాట్లాడటం లేదు—"

"ఎలానైనా మీరు సమర్థించుకో గలరు'' అంది విమల.

''ఇందులో నేను సమర్థించుకోవడం ఏముంది నిమ్మీ...నీకింకా నా థియరీ బోధపడేట్లు చెప్తా చూడు. రామన్ ఎఫెక్టు ఏం చేప్తోంది? ఓ పదార్థంలోంచి వెలుగు కిరణం వెలువడిందనుకో...దాన్ని స్పెక్ట్రోగ్రాఫ్‌లోంచి చూస్తే ఆ కిరణంతోపాటు మరికొన్ని కిరణాలు కన్పిస్తాయ్. మనిషిలో ఏదో ఒహ గుణం ఎక్కువగా అందరి దృష్టినీ ఆకట్టుకొనడంతో ఆ మనిషి ఆ గుణం కలవాడంటున్నారు. కాని అతన్ని పరీక్షించి చూస్తే అన్ని గుణాలూ కన్పిస్తాయి. ఆ రామన్ ఎఫెక్టు పదార్థ విజ్ఞాన శాస్త్రంలోది. ఈ రామం ఎఫెక్టు మనస్తత్వ శాస్త్రంలోది... ఏమంటావ్ ?''అన్నాడు కనుబొమ ఎగరేస్తూ రామగోపాలం.

"నే నేమంటాను... మా లెక్చరరుకన్నా సింపుల్‌గా చెప్పారు, కాని మొత్తంమీద లలిత సంగతి దాటేశారు గదా..." అంది విమల.

"నన్నింతవరకూ నువ్వొక కోణంలోంచి మాత్రమే చూసి ఇష్ట పడ్డావ్. లలితతో సినిమాకు వెళ్ళడం విని ఇంకో కోణంలోంచి చూశావ్. ఆ ప్రవర్తన నీ కిష్టపడలేదు. అంచేత చెడ్డవాడినై పోయానన్న మాట. అయితే నీ వాడిని నువ్వు చెడ్డవాడనుకోవడం కూడా నీ కిష్టం లేదు. అంచేతనే అనుమానపడుతున్నావు. ఇంకా ఖచ్చితంగా చెప్పా లంటే లలితకూ, నాకూ క్లాసుమేటులను మించిన సంబంధమేదో ఉందన్న అనుమానం నీకున్నట్టుంది. ఆ అనుమానం నిన్ను వదల నంటోంది. అవునా" ?

"అబ్బే—నేనలా అన్నానా—" అంటూ ఇంకా ఏవో చెప్ప బోయింది విమల.

"నేనొకటి చెప్తా వింటావ్... అనుమానం అనేది క్రియేట్ చేస్తే ఎంత నమ్మకం వున్న వాళ్ళకైనా ఆ అనుమానం ఏదోమూల తొలి చేస్తుంటుంది. దాన్ని రానివ్వకనే పోవాలిగాని రానిస్తే పోనే పోనంటుంది. నీ సంగతి అలావుంచు. నన్ను కన్నతల్లీ— నా స్వయాన తోడబుట్టిన వాళ్ళూ నా చిన్నప్పటినుండి నన్ను చాలా దృక్పథాల్లోంచి చూసే వుంటారుగా... నా మీద ఎంత నమ్మకం వున్నా సులువుగా అనుమానం అన్నది కలిగిపోతుంది. కావాలంటే ఋజువుతోసహా నిరూపించేస్తాను. చూడు, ఆ ఫోనందుకో ఓసారి..." అంటూ చేయి చాపేడు రామ గోపాలం.

"ఎందుకండీ ... ఏం చేస్తారు ?" అంటూ అయోమయంగా ఫోను చేత్తో పట్టుకుంది విమల.

"చిన్న తమాషా— చూడు —" అంటూ ఫోనందుకుని ఓ నెంబరు డయిల్ చేశాడు రామగోపాలం- 'ఎందుకూ ఎందుకూ'

అంటూ విమల నణుగుతూనే వుంది. "హలో! మేనేజర్ విశ్వంగారేనా మాట్లాడుతున్నది... నమస్కారమండీ... నేనా... నా పేరు ఎమ్ వీ రాజ శేఖరమంటారండి....అబ్బే మరేంలేదూ...రామగోపాలం గారికి మీరు చాలా దగ్గర స్నేహితులట నేను రామగోపాలంగారి బావమరిదినిలెండి. ఆయనను ఓసారి కలుసుకుని ఆయన భార్య మగపిల్లాడిని ప్రసవించిందని చెప్పాలండి...ఆయనకు కాకపోతే వాళ్ళింట్లో చెప్పండి. నేను స్టేషనునుండి మాట్లాడుతున్నాను. మరి నేనర్జంటుగా సోంపేట వెళ్ళాలండి...మరివుంటానండి...ఆవిషయం మాత్రం అర్జంటుగా వాళ్ళింట్లో చెప్తారుకదూ...చాలా థాంక్సండి'' రామగోపాలం ఫోను దించేశాడు.

"ఏవిటి ఇదంతాను రాజశేఖరేమిటీ...మీ భార్యేమిటీ...ప్రసవించడమేమిటీ ? ''అంది గాభరాగా విమల.

''చూశావా ? అంతలోకే నువ్వే గాభరాపడిపోతున్నావు...ఆ మేనేజరు విశ్వంగాడు నాకు ధిక్కెస్ట్ ఫ్రెండా...నాకు పెళ్ళవని సంగతి వాడికి తెలుసు. నమ్మకంగా ఎవడో సోంపేట రాజశేఖరుడు ఫోన్‌చేసే సరికి...ఏమో వాడికి తెలీకుండా నేను పెళ్ళి చేసేసుకుని పిల్లల తండ్రినయిపోయి వుంటానని వాడు నమ్మేశాడు. నమ్మేస్తాడు. వాడేవిటి... రేపటికి మా ఇంట్లో ఎంత గందరగోళంగా వుంటుందో నువ్వే వెళ్ళి చూడు... నే నిప్పుడు కేంపు వెళ్తున్నాను. ఆ ఎడబాటు చెప్పకోవటానికే దేవిగారి దగ్గరకు వస్తే ఎంత పని చేయించావో చూడు ... అయినా దాని ఎఫెకు నువ్వే చూడు."

''ఎందుకండీ ఈ తమాషాలన్నీ..."

''మరేంలేదు... అనుమానమన్నది ఎంత తొందరగా వ్యాపిస్తుందో చూద్దువుగాని... ఫర్వాలేదు. థ్రిల్ లేకపోతే ఎలా—? వస్తా'' అంటూ బుగ్గమీదో చిటికవేసి వెళ్ళిపోయాడు రామగోపాలం.

మర్నాడు విమల వాళ్ళింటికి వెళ్లేసరికి వాళ్ళ అమ్మగారు వోమూల, అక్క చెల్లెళ్ళొక గదిలోను, అన్నదమ్ములు మరో రూములోను చేరగిలపడిపోయి విమలని పలకరించడానికైనా ఓపికల్లేని స్థితిలో వుండేసరికి విమల నవ్వుతో ఉప్పొంగి పోయింది.

(ఆంధ్ర జ్యోతి)